నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. వినయ్‌నగర్‌ 33/11 కేవీ విద్యుత్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. క్రిష్ణానగర్‌, వినయ్‌నగర్‌, ఎస్‌ఎస్సార్‌ నగర్‌, బీఎస్‌ఎన్‌ఎల్‌, శ్రీనివాసనగర్‌, బాలాజీనగర్‌ కాలనీల్లో విద్యుత్‌ అంతరాయం ఉంటుందన్నారు.

27న నాగోలు గ్రామంలో బోనాలు



సమావేశంలో పాల్గొన్న యెగ్గె మల్లేశం

నాగోలు: ఈ నెల 27న బోనాలు పండుగ నిర్వహిస్తున్నట్లు నాగోలు రామాలయ, పోచమ్మ దేవాలయ, మహంకాళి దేవాలయ చైర్మన్‌, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తెలిపారు. సోమవారం నాగోలులో నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నాగోలు గ్రామస్తులతో కలిసి బోనాల జాతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. నాగోలు పరిసర ప్రాంతాల్లో జూలై 24న తేదీన కాటమయ్య బోనాల ఉత్సవాలు, జూలై 27న బోనాలు పండగ తేదీలను ఖరారు చేశామన్నారు.

జలమండలి జీఎం బదిలీ

ఎల్‌బీనగర్‌: జలమడలి ఎల్‌బీనగర్‌–11 డివిజన్‌ జీఎం శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఇటీవల పలువురు కార్పొరేటర్లు ఆయనపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతోనే బదిలీ చేసినట్లు చర్చ జరుగుతుంది.శ్రీనివాస్‌ రెడ్డి జమండలి మణికొండ–18 డివిజన్‌కు బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న మహేంద్ర నాయక్‌ను ఎల్‌బీనగర్‌–11 డివిజన్‌ జీఎంగా బదిలీ చేశారు.

పోస్టర్‌ విడుదల



నాగోలు: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్‌ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం న్యూనాగోలు కాలనీలోని ఎస్‌కే డాంగే భవన్‌లో ఆగస్టు నెలలో మేడ్చల్‌ జిల్లా జరుగుతున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌, కరప్రతాలను విడుదల చేసి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి పల్లి కృష్ణ మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలబడి, అనేక పోరాటాలు చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బషీర్‌, రాములు, రాజేందర్‌, మల్లేష్‌గౌడ్‌, సంజీవ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

దిల్‌సుఖ్‌నగర్‌: డివిజన్‌ పరిధలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆర్‌కేపురం కార్పొరేటర్‌ రాధాధీరజ్‌రెడ్డి సూచించారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో సోమవారం కార్పొరేటర్‌ పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించి మాట్లాడారు. డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌ పనులు కొనసాగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తయిన వెంటనే నూతన రహదారులు నిర్మిస్తామన్నారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన డివిజన్‌ పరిధిలోని మారుతీనగర్‌, రాజిరెడ్డినగర్‌ కాలనీలో రూ 2.40 కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్‌ ఈఈ రఫీ, ఏఈ సురేష్‌, నాయకులు రాజేష్‌, శేఖర్‌, శ్రీనివాస్‌, జనార్దన్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

చందనకు గోల్డ్‌ మెడల్‌



సాక్షి, సిటీబ్యూరో: దిల్‌సుఖ్‌నగర్‌లోని శారదానగర్‌కు చెందిన కొలను చందన బీటెక్‌ కంప్యూటర్‌ సైన్స్‌ విభాగంలో గోల్డ్‌ మెడల్‌ సాధించింది. కాకతీయ యూనివర్సిటీ–23వ స్నాతకోత్సవంలో ఆమె గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ చేతులమీదుగా గోల్డ్‌మెడల్‌ అందుకున్నారు.

సమస్యల పరిష్కారానికి

దివ్యాంగుల ధర్నా

చైర్మన్‌, డైరెక్టర్‌ హామీతో విరమణ



కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు

చాదర్‌ఘాట్‌: వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా ఏర్పాటు చేయాలని కోరుతూ సదనాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం మలక్‌పేటలోని కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సదనాల పరిరక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ.. శారీరక వికలాంగులకు రోస్టర్‌ పాయింట్‌ను 56 నుంచి 10లోపు మార్చాలని అన్నారు. అదే విధంగా ఎస్‌ఆర్‌డీ బ్యాక్‌లాగ్‌ ఉద్యోగాల భర్తీ జీఓను వెంటనే పొడిగించాలని డిమాండ్‌ చేశారు. ఆర్‌పీడబ్ల్యూడీ 2016 చట్టం ప్రకారం 92 సెక్షన్‌ జీఓను వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈఆర్‌ఎస్‌ స్కీమ్‌ ద్వారా ప్రతి జిల్లాకు రూ. 3కోట్లు కేటాయించాలని, వికలాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు.

◆ దివ్యాంగుల సమస్యలను ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని త్వరలో ముఖ్యమంత్రితో వికలాంగుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్‌ ముత్తినేని వీరయ్య హామీ ఇచ్చారు.

◆ హాస్టళ్లలో సమస్యలు లేకుండా చూస్తానని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌ బి.శైలజ హామీ ఇచ్చారు. చైర్మన్‌, డైరెక్టర్‌ హామీతో సదనాల పరిరక్షణ సమితి నాయకులు ధర్నాను విరమించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఏసీపీ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. దివ్యాంగులు కార్యాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకొని ధర్నా నిర్వహించడంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

అవగాహన లేమితో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: అవగాహన లేకుండా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులు వర్షాకాలంలో రోడ్లు వేస్తున్నారని, వర్షాలకు పనులో నాణ్యత లోపిస్తుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎల్‌బీనగర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ కొత్త రవీందర్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ నీళ్ల అంజన్‌కుమార్‌ గౌడ్‌ మాట్లాడారు. వనస్థలిపురం రైతు బజారు వద్ద రోడ్డు అధ్వానంగా ఉందని, దానిని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పనుల విషయంలో ప్రాధ్యాతను పాటించడం లేదని, నాయకుల ఒత్తిడి మేరకు వారు సూచించిన ప్రాంతాల్లోనే పనులు చేపడుతున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో నాలాలలో పూడిక తీయడం లేదని, అలాగే పలు కాలనీలలో వీధి దీపాలు వెలగడం లేదని బోనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కాలనీలలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని కోరారు.

కాలనీల్లో కుక్కల బెడద



పద్మావతినగర్‌ కాలనీలో రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

వనస్థలిపురం: కాలనీల్లో వీధి కుక్కల బెడదతో బయటకు రాలేని దుస్థితి నెలకొందని వివిధ ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు. కుక్కల బెడదపై మున్సిపల్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకుండా పోతుందని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఏజీఎం సతీష్‌

మలక్‌పేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీచైతన్య స్కూల్స్‌ దిల్‌సుఖ్‌నగర్‌ జోన్‌ ఏజీఎం సతీష్‌ అన్నారు. స్మార్ట్‌ లీవింగ్‌ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం గ్రీన్‌ ఇండియా మిషన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడు భవిష్యత్‌ తరాల కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవితేజ, ప్రిన్సిపాల్‌ రిజ్వానా, ఏవో భాస్కర్‌, డీన్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ జెండావిష్కరణ



జెండా ఆవిష్కరణ చేస్తున్న పవన్‌కుమార్‌

నాగోలు: 30సంవత్సరాలుగా నిర్విరామంగా పోరాటం చేసి, ఎస్సీ వర్గీకరణ సాధించిన మహనీయుడు మందకృష్ణ మాదిగ అని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. ఎమ్మార్పీఎస్‌ 31వ ఆవిర్భావ వేడుకులు, మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా ఎల్‌బీనగర్‌ ఎమ్మార్పీఎస్‌ నాయకుడు కొమ్ము రాజశేఖర్‌ ఆధ్వర్యంలో కొత్తపేట్‌ డివిజన్‌లోని తెలంగాణ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్‌ పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌ కుమార్‌, సత్యనారాయణ, గట్టు మహేష్‌ కుమార్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని లక్ష్మీనగర్‌ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డివిజన్‌లో ఎక్కడైనా ఏదైనా సమస్య తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, సీఎస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌, మోహన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, శ్రీనివాస్‌, నరసింహ మూర్తి పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి కృషి చేయాలి



చంచల్‌గూడ: మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ నవాబు శివకుమార్‌గౌడ్‌ అన్నారు. యూత్‌ ఫర్‌ యాంటీ కరప్షన్‌ సంస్థ టీషర్ట్‌ లోగోను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామస్థాయిలో యువతకు సమాజం, హక్కులపై అవగాహన కల్పించాల్సి అవసరముందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రవంతి, గీతానంద్‌, రమేష్‌, హరికృష్ణ పాల్గొన్నారు.

ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటుకు కృషి



కాలనీలో పర్యటిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: కాలనీలోని కమ్యూనిటీహాల్‌ వద్ద ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటుకు కృషి చేస్తానని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్‌ హయత్‌నగర్‌ పరిధిలోని విష్ణునగర్‌కాలనీలో సోమవారం కార్పొరేటర్‌ పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీలోని మిగిలిపోయి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసకుమార్‌, రామ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాన్యనాయక్‌, ప్రసాద్‌, మధునాయక్‌, భాస్కర్‌నాయక్‌, శ్రీనివాస్‌రెడ్డి, జయతేజ, రమేష్‌చారి, యాదగిరియాదవ్‌ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.33, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.48, బీరకాయ రూ.51, కాలిఫ్లవర్‌ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్‌ రూ.37, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.55, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.23,అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, క్యాప్సికమ్‌ రూ.60. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఉపాధ్యాయుల నియామానికి ప్రజావాణిలో లేఖ

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా విద్యాబోధన జరగాలంటే సరిపడే ఉపాధ్యాయులు ఉండాలని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని నందనవనంకాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కాలనీ వాసులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ లేఖను హస్తినాపురం డివిజన్‌ బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్‌ సోమవారం ప్రజావాణిలో డీఆర్‌ఓకు అందజేశారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

హయత్‌నగర్‌: డివిజన్‌లోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డిప్యూటీ కమిషనర్‌ తిప్పర్తి యాదయ్యతో కలిసి లక్ష్మిప్రియ కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని, వీధి లైట్ల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ను దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్‌, ఉపేందర్‌గౌడ్‌, పరశురాములు, మురళి, అచ్చిరెడ్డి, వెంకటేష్‌, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నాగోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమి లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ డిస్ట్రిక్ట్‌ హెల్త్‌ క్యాంప్స్‌ చైర్మన్‌ డాక్టర్‌ విజయరంగ అన్నారు. సేవ్‌ ఎర్త్‌ ఫౌండేషన్‌, జయ్‌ గణేష్‌ భక్తి సమితి, జీవనది ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వివిధ కాలనీలకు చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ విజయరంగ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితులలో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వారి కోసం ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి చిరంజీవి చారిటబుల్‌ ట్రస్ట్‌ తరుపున సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌, లక్ష్మిదుర్గ, అశోక్‌, కృష్ణ, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గీతా పారాయణం



మన్సూరాబాద్‌: నాగోలు డివిజన్‌ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం గణపతి సచ్చితానంద స్వామి శిష్యబృందంచే నిర్వహించిన భగవత్‌ గీతా పారాయయంలో వివిధ ప్రాంతాల వారు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ పోచబోయిన గణేష్‌యాదవ్‌, యాదగిరి, హనుమంతరావు, మురళి, అజయ్‌, రమణమూర్తి, అర్చకులు బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

హస్తినాపురం: కులమతాలకతీతంగా పండగలు జరుపుకోవాలని భూపేశ్‌గుప్తానగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. మొహర్రం సందర్భంగా ఆదివారం రాత్రి భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలో పీర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్‌ మాట్లాడుతూ.. తమ కాలనీలో హిందువులు, ముస్లింల కలిసి మెలిసి అన్ని పండగలు జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, సయ్యద్‌ పాషా, ఖాజా, రియాజ్‌, పాషా, బాబా పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పండుగలు జరుపుకోవాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల



చెక్కులు అందజేస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

మలక్‌పేట/చాదర్‌ఘాట్‌: ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పండుగలు, వేడుకలు జరుపుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 105 అమ్మవారికి ఆలయాలకు మంజూరైన బోనాల చెక్కులను ఎండోమెంట్‌ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మిమధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, ఓల్డ్‌మలక్‌పేట ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్‌, అధికారులు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించండి..

సైదాబాద్‌: ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం సైదాబాద్‌లోని అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులకు దేవాదాయ శాఖ నుంచి మంజూరైన నిధులను అందజేశారు.



వారోత్సవాల్లో పాల్గొన్న చింతలఅరుణ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నాగోలు: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని నాగోలు డివిజన్‌ కార్పొరేటర్‌ చింతల అరుణ సురేందర్‌ యాదవ్‌ సూచించారు. హయత్‌నగర్‌ సర్కిల్‌–03 నాగోలు జైపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఇందిరా మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు అందించే వడ్డీ లేని రుణాలు, కొత్త గ్రూప్‌ ఫార్మేషన్‌, ర్యాపిడో ప్రోగ్రాం, టైలరింగ్‌ స్టిచింగ్‌ యూనిట్లు, తదితర రుణాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బలరాం, యూజీడీ సెక్షన్‌ ఇన్‌చార్జ్‌ మమత, నాయకులు రావుల శ్రీనివాస్‌, మైనం రాజేష్‌,సరస్వతి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ ఉద్యమ ఫలితమే ఎస్సీవర్గీకరణ



జెండా ఆవిష్కరణలో నాయకులు

మలక్‌పేట: ఎమ్మార్పీఎస్‌ ఉద్యమ ఫలితంగా ఎస్సీవర్గీకణ అని సీనియర్‌ నాయకుడు విష్ణుమాదిగ అన్నారు. సోమవారం మలక్‌పేటలో దబ్బెట రాజు మాదిగ అధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్‌ 31వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. సామాజిక పరమైన రుగ్మతులపై పోరాటం చేసి విజయం సాధించిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి శ్రీనివాస్‌, లింగాల యాదయ్య, గుండె నర్సింగ్‌రావు, కందికట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాగోలు: కొత్తపేట్‌ డివిజన్‌ సత్యనగర్‌లోని శ్రీ కంఠ మహేశ్వర ఆలయంలోని సురమాంబిక అమ్మవారికి సోమవారం వెండి పట్టీలు, వెండి కళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ కొత్తపేట డివిజన్‌ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్‌ పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌ గౌడ్‌, విజయ్‌ గౌడ్‌ , కాట విజయ గౌడ్‌, స్వర్ణ, పింకీ, బిజెపి నాయకులు డివిజన్‌ అధ్యక్షులు మంచి రాజేష్‌, వగ్గుల సత్యనారాయణ, గట్టు మహేష్‌ కుమార్‌ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



మలక్‌పేట: లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్‌ యూనియన్‌ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు సూరారం అశోక్‌ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కారించడానికి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కాంట్రాక్ట్‌ , ఔట్‌సోర్సింగ్‌, ఫిక్స్‌డ్‌ టర్మ్‌, అప్రెంటీస్‌, థర్డ్‌పార్టీ, ట్రైనీలుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్‌ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించి సంవత్సరానికి 200 రోజుల పని రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

అర్ధరాత్రి ఢాం.. ఢాం

- పుట్టిన రోజు వేడుకల పేరుతో బాణాసంచాల భారీ శబ్దాలు
- ఉలిక్కిపడుతున్న వృద్ధులు, చిన్నారులు



చంచల్‌గూడ: నగరంలో రాత్రి వేళ ఆకస్మికంగా బాణాసంచా పేలుళ్ల శబ్దాలు ప్రజలను భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా పాతబస్తీలో అర్ధరాత్రి సమయంలో పుట్టిన రోజు వేడుకలు, వివిధ కార్యక్రమాల పేర్లతో గంటల తరబడి బాణాసంచా కాలుసుండటంతో వృద్ధులు, చిన్నారులు ఉలిక్కిపడుతున్నారు. ఇటీవల బస్తీల్లో, కాలనీల్లో అర్ధరాత్రి పుట్టినరోజు వేడుకల పేరుతో పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తుండటం ట్రెండ్‌గా మారింది. ఈ రకమైన కార్యక్రమాలు రాత్రి 11 గంటల తర్వాత కూడా కొనసాగుతుండటంతో శాంతియుతంగా సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. ఇలాంటి కార్యకలాపాలను నియంత్రించాల్సిన బాధ్యత నగర పోలీసు శాఖపై ఉంది. అర్ధరాత్రి సమయంలో బాణాసంచా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో పోలీసు శాఖ మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నగర పోలీసు కమిషనర్‌ ఈ అంశంపై మరింత శ్రద్ధ వహించి ఇలాంటి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంలోనూ ప్రజలు వెనకడుగా వేస్తున్నారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే తమపై దాడులకు సైతం దిగుతారనే ఒక్కింత భయానికి గురవుతున్నారు.